క్లుప్తంగా

ఆర్డీఎస్ కుడికాలువ పూర్తి చేయాలి



మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి గిడ్డయ్య

ఎమ్మిగనూరుటౌన్: జిల్లా పశ్చిమ ప్రాంతంలోని ఎమ్మిగనూరు, మంత్రాలయం నియోజకవర్గ ప్రజల చిరకాల స్వప్నమైన ఆర్డీఎస్ కుడి కాలువ నిర్మాణం సత్వరం పూర్తి చేసి మంత్రాలయం నుంచి కర్నూలు రైల్వే లైన్‌ను ఏర్పాటు చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గిడ్డయ్య కోరారు. ఆదివారం పట్టణంలోని తేరు బజారులోని మినీ ఫంక్షన్ హాల్‌లో పట్టణ సీపీఐ కార్యదర్శి రంగన్న అధ్యక్షతన ఆయా నియోజకవర్గాల సీపీఐ కార్యకర్తల సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ జిల్లాలో పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులను పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా పట్టణంలో లెదర్ ఫ్యాక్టరీని పునఃప్రారంభించాలన్నారు. సమావేశంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి మునెప్ప, ఆయా నియోజకవర్గాల సీపీఐ నాయకులు పాల్గొన్నారు.

మొక్కలు నాటి సంరక్షించాలి

ఎమ్మిగనూరుటౌన్: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని, ప్రతిఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ సర్కిల్ ప్రధాన అధికారి ఉమేష్‌కృష్ణ పిలుపునిచ్చారు. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు చేపట్టిన గో గ్రీన్ కార్యక్రమంలో భాగంగా నలందా విద్యాసంస్థల అధినేత మహానందయ్య ఆధ్వర్యంలో ఆదివారం పట్టణంలో మొక్కలు నాటారు. ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం పంటల సాగు, తాగేనీరు, తినే ఆహారం, పీల్చే గాలి ఇలా అన్నీ కలుషితమౌతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతిఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షిస్తే భావితరాలకు పర్యావరణాన్ని అందించిన వారమౌతామని పేర్కొన్నారు. స్థానిక బీఎంలు రాజశేఖర్, విష్ణువర్దన్, సిబ్బంది హరికృష్ణ, ప్రసాద్ పాల్గొన్నారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

చిప్పగిరి: మండల కేంద్రం నుంచి గుంతకల్లు వెళ్లే మార్గంలో గోడౌన్ల వెనుక భాగంలో ఆదివారం గుర్తు తెలియని మృతదేహం లభ్యమైంది. మృతుడి వయసు 45 నుంచి 50 ఏళ్ల మధ్య ఉంటుంది. నీలిరంగు దుస్తులు, కన్నడ అక్షరాలు గల టీషర్టు ధరించిఉన్నాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని వ్యక్తి ఆచూకీ తెలుసుకునేందుకు విచారణ చేపట్టారు. బంధువులు లేదా మృతుడి గురించి వివరాలు తెలిసిన వారు చిప్పగిరి ఎస్ఐ 91211 01160 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

తప్పుడు ఆరోపణలు తగదు

హాలహర్వి: జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ వలంటీర్ వ్యవస్థపై తప్పుడు ఆరోపణలు చేయడం తగదని హాలహర్వి జెడ్పీటీసీ సభ్యుడు లింగప్ప అన్నారు. ఆయన ఆదివారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో మాట్లాడుతూ.. ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా సేవలందిస్తున్న వలంటీర్ వ్యవస్థ ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచిందన్నారు. వలంటీర్లు తమ పరిధికి మించి లబ్ధిదారులు ఉన్నచోటికే వెళ్లి సేవలందిస్తూ ప్రశంసలు పొందుతున్నారని చెప్పారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతిఒక్కరికీ సకాలంలో చేరవేస్తున్నారని వివరించారు. అలాంటి వ్యవస్థపై నోరుపారేసుకున్న పవన్‌కళ్యాణ్ క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. వైఎస్‌ఆర్‌సీపీ మండల కన్వీనర్ భీమప్పచౌదరి, ఎంపీటీసీ గోపాల్, వైస్ ఎంపీపీ నగేష్, నాయకులు శ్రీనివాసులు, బాపురం నాగేంద్ర, లక్ష్మన్న, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థికి అభినందన

దేవనకొండ: నూజివీడు ట్రిపుల్‌ఐటీలో సీటు సాధించిన మండలంలోని కప్పట్రాళ్లకు చెందిన విద్యార్థి జశ్వంత్‌కుమార్‌ను వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కప్పట్రాళ్ల మల్లికార్జున ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా సన్మానించారు. విద్యార్థి బాగా చదువుకుని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు.

ఆధ్యాత్మికతతో మెలగాలి



గురువు శ్రీనివాసులరావు స్వామీజీని సన్మానిస్తున్న బిణిగేరి గ్రామస్తులు

ఆస్పరి: ప్రతిఒక్కరూ ఆధ్యాత్మికతతో మెలిగి ప్రశాంతం జీవనం సాగించాలని బిణిగేరి పంచలింగేశ్వర స్వామి ఆలయ నిర్వాహకులు శ్రీనివాసులరావు స్వామీజీ సూచించారు. ఆదివారం ఆలయ ఆవరణలో శ్రీనివాసులరావు స్వామీజీ జన్మదినోత్సవాన్ని బిణిగేరి గ్రామస్తులు, శిష్యులు ఘనంగా జరుపుకున్నారు. ఆయనకు పూలమాలలు వేసి సన్మానించారు. ఆయన మాట్లాడుతూ.. నిత్యం భగవంతుడిని స్మరించుకోవాలని సూచించారు. సేవాగుణం అలవర్చుకోవాలన్నారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.

నాటుసారా స్వాధీనం

తుగ్గలి: మండల పరిధిలోని రోళ్లపాడు తండాలో నాటుసారా తయారీకి ఉపయోగించే 500 కేజీల నల్లబెల్లం, 220 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నట్లు జొన్నగిరి ఎస్ఐ రామాంజనేయులు ఆదివారం తెలిపారు. తండాలో పలు ఇళ్లలో నిర్వహించిన తనిఖీల్లో బెల్లం, నాటుసారా పట్టుబడిందన్నారు. ఐదుగురుపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ చెప్పారు.

విద్యుత్ సమస్యలకు చెక్

- జీఐఎస్‌తో బ్రేక్‌డౌన్ సమస్యకు పరిష్కారం
- ట్రాన్స్‌ఫార్మర్లు, మీటర్లు, విద్యుత్ స్తంభాలను క్యాప్చర్ చేసి లైట్‌యాప్ ద్వారా జియోట్యాగింగ్
- అనధికార కనెక్షన్లకు చెక్
- విద్యుత్ సరఫరా డీటీఆర్, కామన్ సర్వీస్‌ల క్యూఆర్ కోడ్ స్టిక్కర్లు
- ఆలూరు సబ్‌డివిజన్‌లో 65,129 ఎల్‌టీ కనెక్షన్లు, 11,114 వ్యవసాయ బోర్లు



బోరు కనెక్షన్ ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ వద్ద క్యూఆర్ కోడ్ స్టికర్ అతికించి స్కాన్ ద్వారా వివరాలు అప్‌లోడ్ చేస్తున్న సిబ్బంది



విద్యుత్ స్తంభాలు, మీటర్లకు అతికించిన క్యూఆర్ కోడ్ స్టిక్కర్లు

ఆలూరు రూరల్: వినియోగదారులు, రైతులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంది. విద్యుత్ సమస్యలకు శాశ్వత పరిష్కారానికి బాటలు వేస్తోంది. విద్యుత్ కనెక్షన్ ఉండి బోరు కింద పంటలు సాగుచేసుకుంటున్న రైతులు, గృహ వినియోగదారులు, చిన్నపెద్ద తరహా పరిశ్రమలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలని జీఐఎస్ (జియోగ్రాఫిక్ ఇన్మఫర్మేషన్ సిస్టం) అనే వైబ్‌సైట్ ద్వారా టెక్నాలజీ అందుబాటులోకి తీసుకువచ్చింది. బ్రేక్ డౌన్ సమస్యలు లేకుండా ఉండేందుకు వ్యవసాయ, వివిధ రకాలైన ఎల్‌టీ-1 నుంచి ఎల్‌టీ-4 విద్యుత్ కనెక్షన్లకు డీటీఆర్, కామన్ సర్వీస్‌లకు క్యూఆర్ కోడ్ స్టిక్కర్లు అంటించి.. వాటిని స్కానింగ్ చేయడం ద్వారా ఆ ప్రాంతం నుంచి విద్యుత్ సిబ్బంది లైట్ యాప్ ద్వారా విద్యుత్ కనెక్షన్ ఉన్న వ్యక్తి, రైతుకు చెందిన సర్వీస్ వివరాలు అప్‌లోడ్ చేస్తున్నారు. దీంతో అధికారులు విద్యుత్ కనెక్షన్ల డేటాతో పోల్చుకుంటారు. అనధికార సర్వీసులను వినియోగించుకుని కరెంట్ వాడుతున్న సర్వీసులను కట్ చేస్తారు. సాంకేతిక సమస్యలు వచ్చినప్పుడు జీఐఎస్ యాప్ ద్వారా సంబంధిత ఏఈ, లైన్‌మెన్‌లు ఈ యాప్‌లో లాగినై ఎక్కడ సమస్య ఉందో తెలుసుకుని మరమ్మతులు చేస్తారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు శుక్రవారం నుంచి వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు, మీటర్లు, స్తంభాల ఫోటోలు తీసి ఆన్‌లైన్ ప్రక్రియ ప్రారంభించారు. అనంతరం గ్రామాల్లో ఈ ప్రక్రియ ప్రారంభించనున్నట్లు అధికారులు తెలియజేస్తున్నారు.

జీఐఎస్‌తో బ్రేక్‌డౌన్ సమస్యకు పరిష్కారం

వర్షాకాలంలో ఈదురు గాలులతో విద్యుత్ స్తంభాలు నేలకొరిగి, వైర్లు తెగిపడి బ్రేక్‌డౌన్, వేసవి కాలంలో అధిక లోడు వల్ల ట్రాన్స్‌ఫార్మర్లు ఫెయిల్ కావడంతో నిలిచిపోయే విద్యుత్ సరఫరాకు బ్రేక్ పడనుంది. ఎక్కడ సాంకేతిక లోపం వచ్చిందని విద్యుత్ అధికారులు సిబ్బంది ఎల్‌టీ లైన్లు, ఫీడర్ల వెంబడి చెక్ చేసుకోవాల్సిన పరిస్థితి లేకుండా ప్రభుత్వం, ఏపీఎస్‌పీడీసీఎల్ జీఐఎస్ (జియోగ్రాఫిక్ ఇన్మఫర్మేషన్ సిస్టం) అనే వైబ్‌సైట్ ద్వారా టెక్నాలజీ అందుబాటులోకి తీసుకువచ్చింది. అధికారులకు విద్యుత్ అంతరాయం, ట్రాన్స్‌ఫార్మర్ల లోపం వంటి సాంకేతిక సమస్యలు, వినియోగదారుని వివరాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ సమస్య ఎక్కడ ఏర్పడిందో తెలుసుకుని మరమ్మతులు చేపట్టి సరఫరా పునరుద్ధరిస్తారు. ఆలూరు విద్యుత్ సబ్ డివిజన్‌లోని 5 మండలాల్లో 65,129 ఎల్‌టీ 1-4 వినియోగదారులు, 11,114 మంది రైతులకు వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి.

ఆలూరు విద్యుత్ సబ్‌డివిజన్‌లో వివిధ రకాల కరెంట్ కనెక్షన్లు

మండలం	వ్యవసాయ కనెక్షన్లు	ఎల్‌టీ 1-4 కనెక్షన్లు
ఆలూరు	1,748	16,705
ఆస్పరి	2,705	15,372
చిప్పగిరి	979	8,258
హాలహర్వి	2,324	11,722
హొళగుంద	3,358	13,727

వెంటనే పరిష్కారం



వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్‌తో పాటు అంతరాయం లేకుండా సరఫరా చేసేందుకు ప్రభుత్వం సాంకేతిక పద్ధతిని తీసుకువచ్చింది. ప్రతి స్తంభం, ప్రతి కనెక్షన్, లోకేషన్ క్యాప్చర్ చేసి జియోట్యాగింగ్ చేస్తున్నాం. క్యూఆర్ కోడ్ స్కాన్‌తో ఆ కనెక్షన్ల వివరాలన్నీ ఆన్‌లైన్‌లో ఫీడ్ అవుతాయి. అనధికారంగా కరెంట్ వాడుతున్న వారి కనెక్షన్లు తెలుస్తాయి. వీటిని వెంటనే తొలగిస్తాం. బ్రేక్‌డౌన్ సమస్య ఎక్కడ వచ్చిందో ఆన్‌లైన్‌లో చెక్‌చేసి ఆ ఫీడర్, లైన్‌కు వెంటనే వెళ్లి మరమ్మతులు చేయవచ్చు.

– నాగేంద్ర ప్రసాద్, డీఈఈ, ఆలూరు,

ఎలుకల దాడిలో విద్యార్థినులకు గాయాలు

గోనెగండ్ల: స్థానిక ఏపీ మోడల్ స్కూల్ హాస్టల్ విద్యార్థినులపై ఎలుకలు దాడి చేశాయి. ఈ ఘటనలో 10 మంది విద్యార్థినులు గాయపడ్డారు. ఈ విషయం ఆలస్యంగా ఆదివారం వెలుగులోకి వచ్చింది. హాస్టల్‌లో ఎనిమిది గదులు ఉండగా వంద మంది విద్యార్థులు ఉన్నారు. పరిసరాలు శుభ్రంగా లేకపోవడం, తలుపులకు రంధ్రాలు ఉండడంతో ఎలుకలు గదుల్లోకి వస్తున్నాయి. నాలుగు రోజుల క్రితం రాత్రి నిద్రిస్తున్న పది మంది విద్యార్థినుల కాళ్లు, చేతులను ఎలుకలు కొరికాయి. విద్యార్థినులు షర్మిల, భారతి, చందన, స్వాతి, కల్పనతో పాటు మరికొందరికి రక్త గాయాలయ్యాయి. వీరికి మూడు రోజుల క్రితం గోనెగండ్ల ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స చేయించారు. ఎలుకల దాడి ఘటన బయటకు తెలిస్తే ఇబ్బంది కలుగుతుందని హాస్టల్ సిబ్బంది గోప్యంగా ఉంచారు. ఈ విషయమై పాఠశాల ప్రిన్సిపల్ షాహినా పర్వీన్ మాట్లాడుతూ.. విద్యార్థినులను ఎలుకలు కొరికిన విషయం వాస్తవమేనని, వారికి ఆస్పత్రిలో చికిత్స చేయించామని, అందరూ క్షేమంగా ఉన్నారని తెలిపారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటామని చెప్పారు.

హాస్టల్ సిబ్బందిపై చర్యలు తీసుకోవాలి

స్థానిక ఏపీ మోడల్ స్కూల్ నిర్వహణ పట్ల నిర్లక్ష్యం వహిస్తున్న పాఠశాల, హాస్టల్ సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ తాలూకా అధ్యక్షుడు మునిస్వామి డిమాండ్ చేశారు. ఆదివారం ఏఐఎస్ఎఫ్ నాయకులు హాస్టల్ ముందు నిరసన తెలియజేశారు. వారు మాట్లాడుతూ హాస్టల్‌లో నిద్రిస్తున్న విద్యార్థినులపై ఎలుకలు దాడి చేయడం దారుణమన్నారు. ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపించడంతో సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు.

సీపీఎం జీపుజాత



ఆస్పరిలో జీపు జాత చేపట్టిన సీపీఎం నాయకులు

ఆస్పరి: జిల్లా సమగ్ర అభివృద్ధి కోసం ఆదివారం ఆస్పరి మండలంలోని ఆస్పరి, జొహరాపురం, శంకరబండ, చిరుమాన్‌దొడ్డి, హలిగేర, బిణిగేరి, చిగిళి, నగరూరు, తంగరడోణ, తురువగల్లు, యాటకల్లు, కలపరి, కైరుప్పల గ్రామాలలో సీపీఎం నాయకులు జీపు జాత చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా ప్రధాన కార్యదర్శి గౌస్‌దేశాయ్ మాట్లాడుతూ.. ఆస్పరి మండలానికి పందికోన రిజర్వాయర్ నుంచి తాగు, సాగు నీరు అందించాలని డిమాండ్ చేశారు. సీపీఎం నాయకులు హనుమంతు, మాణిక్యప్ప, బాలకృష్ణ, రంగస్వామి, రామాంజినేయులు తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సౌకర్యం కల్పించండి

నందవరం: తుంగభద్ర నది తీర గ్రామాల్లో తాగునీటి సౌకర్యం కల్పించాలని సీపీఎం జిల్లా నాయకులు ఆనంద్‌బాబు, గురుశేఖర్ డిమాండ్ చేశారు. నందవరంతో పాటు ముగతి, మాచాపురం, కొట్టాల, ఇబ్రహీంపురం, నదికైరవాడి, గంగవరం, పెద్దకొత్తిలి, చిన్నకొత్తిలి, నాగలదిన్నె తదితర గ్రామాల్లో తాగునీటి సౌకర్యం కల్పించాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో నాయకులు ఆదివారం జీపు జాత నిర్వహించారు. వారు మాట్లాడుతూ.. తుంగభద్ర నది పక్కనే ఉన్న గ్రామాల్లో తాగడానికి నీరు లేదన్నారు. ఆయా గ్రామాల పరిధిలో సమ్మర్‌స్టోరేజ్ ట్యాంకులు, నీటి శుద్ధి కేంద్రాలను ఏర్పాటు చేసి తాగునీరు సరఫరా చేయాలన్నారు. అలాగే స్కూళ్లలో టీచర్ల పోస్టులను భర్తీ చేయాలని, హాలహర్వి గ్రామంలో సీలింగ్ భూముల సమస్యను పరిష్కరించి పేదలకు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. నాగలదిన్నె–మంత్రాలయం మీదుగా బడి బస్సు ఏర్పాటు చేయాలన్నారు. బ్రిడ్జి పనులు త్వరగా పూర్తి చేయాలని కోరారు. సీపీఎం మండల నాయకులు దేవపుత్ర, నాయకులు స్వామిదాసు, ఎల్లేష్, కరుణాకర్, రాజు, నాగప్ప తదితరులు పాల్గొన్నారు.

20 నుంచి క్రికెట్ టోర్నీ

గోనెగండ్ల: మండల పరిధిలోని పెద్దనేలటూర్ గ్రామంలో మొహర్రం పండుగను పురస్కరించుకొని ఈనెల 20న జిల్లాస్థాయి టెన్నిస్‌బాల్ క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించనున్నట్లు నిర్వాహకులు గిరి, వెంకి, రాజు, రవి తెలిపారు. ఆదివారం వారు మాట్లాడుతూ.. పోటీల్లో గెలుపొందిన జట్లకు మొదటి బహుమతి రూ.15 వేలు, ద్వితీయ బహుమతి రూ.10,016 అందించనున్నట్లు ప్రకటించారు. ఆసక్తి గల క్రికెట్ జట్లు ఈనెల 19వ తేదీలోపు రూ.500 ప్రవేశరుసుం చెల్లించి పేరు నమోదు చేసుకోవాలని కోరారు. వివరాలకు 93902 92693, 88861 37061 ఫోన్ నంబర్లను సంప్రదించాలన్నారు.

'హలో హాస్టల్' కార్యక్రమం

వెల్దుర్తి: సాంఘిక సంక్షేమ హాస్టళ్లలో (వసతి గృహాలు) చదువుకుంటున్న విద్యార్థుల కోసం 'హలో హాస్టల్' కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు, స్థానిక ఎస్సీ హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ (వార్డెన్) ఉస్మాన్ బాష అన్నారు. ఆయన ఆదివారం స్థానిక హాస్టల్ విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు. హాస్టల్‌లోని 200 మంది విద్యార్థుల తల్లిదండ్రులు హాజరయ్యారు. హెచ్‌డబ్ల్యూఓ మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన భోజన మెనూను వివరించారు. హాస్టల్‌లో యోగా, క్విజ్, క్రీడా పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. తల్లిదండ్రులు అవసరమైనప్పుడు 63029 60713 నంబరుకు ఫోన్ చేసి తమ పిల్లలతో మాట్లాడవచ్చన్నారు. ట్యూటర్ అయ్యస్వామి పాల్గొన్నారు.

అనుమానితులు కనిపిస్తే సమాచారమివ్వండి

మద్దికెర: గ్రామాలలో, కాలనీల్లో ఎవరైనా కొత్త వ్యక్తులు అనుమానాస్పదంగా కనిపిస్తే వెంటనే స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఎస్ఐ మహమ్మద్ రిజ్వాన్ కోరారు. ఆదివారం గ్రామస్తులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరిస్తూ పోలీసు సిబ్బంది కరపత్రాలు పంచిపెట్టారు. విలువైన బంగారు, వెండి, నగదును బ్యాంకు లాకరులో ఉంచుకోవడం మంచిదని సూచించారు. ఎవరైనా పాత బంగారానికి మెరుగు పెడతాం అంటూ వస్తే నమ్మవద్దన్నారు. సెల్‌ఫోన్‌లో ఓటీపీ నంబర్లు ఇతరులకు చెప్పరాదన్నారు. సైబర్ నేరాలకు గురైతే వెంటనే 1930 నంబర్‌కు డయల్ చేయాలని, నిత్యం అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

నేడు 25వ వార్డులో 'గడప గడపకు మన ప్రభుత్వం'

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని 25వ వార్డులో సోమవారం ఉదయం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సీనియర్ నాయకుడు ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు పార్టీ పట్టణ అధ్యక్షుడు బుట్టారంగయ్య తెలిపారు. మున్సిపల్ వార్డు కౌన్సిలర్లు, వార్డు ఇన్‌చార్జ్‌లు, పార్టీ శ్రేణులు ఆ వార్డులోని ఎస్ఎంటీ కాలనీ అంజినేయస్వామి గుడి దగ్గరకు రావాలని కోరారు.

బనవనూరు దళిత కాలనీకి మహర్దశ



నేడు- రూపురేఖలు మారిన బనవనూరులోని దళిత కాలనీ



నాడు- మురుగు నీరు నిలిచి అధ్వానంగా ఉన్న కాలనీ

ఆస్పరి: ఆస్పరి మండలంలోని బనవనూరు గ్రామంలోని దళిత కాలనీలో సచివాలయం నిధులు రూ.20 లక్షలతో చేపట్టిన సిమెంట్ రోడ్లు, డ్రైనేజీ కాలువల నిర్మాణంతో రూపురేఖలు మారిపోయాయి. ఒకప్పుడు ఆ కాలనీలో మురుగు నీరు ఆగి కాలనీ వాసులు ఇళ్లలోకి వెళ్లేందుకు కూడా ఇబ్బంది కరంగా ఉండేది. దీనిపై కాలనీ వాసులు గత టీడీపీ పాలనలో నాయకులకు, అధికారులకు ఎన్ని సార్లు చెప్పినా పట్టించుకోలేదు. వైఎస్సార్‌సీపీ పాలనలో ప్రజా ప్రతినిధులు చేపట్టిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా బనవనూరు వెళ్లిన మంత్రి గుమ్మనూరు జయరాం దృష్టికి స్థానికులు సమస్యలను తీసుకెళ్లారు. కాలనీ వాసుల విన్నపం మేరకు మంత్రి కాలనీని సందర్శించి సచివాలయం నిధులు రూ.20 లక్షలతో కాలనీలో సిమెంట్ రోడ్లు, డ్రైనేజీ కాలువలు నిర్మాణం చేపట్టాలని అధికారులను ఆదేశించారు. మంత్రి ఆదేశాలతో సర్పంచ్ పెద్దరెడ్డి దళిత కాలనీలోని కడివెళ్ల కేశన్న ఇంటి నుంచి రంగన్న ఇంటి వరకు, రంగన్న ఇంటి నుంచి చెన్నయ్య ఇంటి వరకు, గౌరప్ప ఇంటి నుంచి తిప్పన్న ఇంటి వరకు, దుబ్బేళ్ల రంగన్న ఇంటి నుంచి అంగన్‌వాడీ కేంద్రం వరకు సీసీ రోడ్లు, డ్రైనేజీ కాలువలు ఏర్పాటు చేశారు. సిమెంట్ రోడ్లు, డ్రైనేజీ కాలువల ఏర్పాటుతో కాలనీ రూపురేఖలు మారిపోయాయి. దీంతో కాలనీ వాసులు, సర్పంచ్ పెద్దరెడ్డి సంతోషం వ్యక్తం చేస్తూ మంత్రి గుమ్మనూరు జయరాంకు కృతజ్ఞతలు తెలిపారు.

బిల్లులు పెండింగ్ లేకుండా చెల్లిస్తున్నాం

సచివాలయం నిధులు మంజూరైన గ్రామాలలో పనులు చేసిన వెంటనే పెండింగ్ లేకుండా బిల్లులు మంజూరు చేస్తున్నాం. మండలంలో 19 సచివాలయాలకు గాను ఇప్పటి వరకు 12 సచివాలయాలకు ఒక్కొక్కటికి రూ.20లక్షలు మంజూరైయ్యాయి. మండలంలో బనవనూరు గ్రామంలో రూ.20లక్షలతో సిమెంట్ రోడ్ల, డ్రైనేజీ కాలువల నిర్మాణం పూర్తి చేశాం. మిగతా గ్రామాలలో పనులు చేపడుతున్నాం.

– యమునప్ప, ఏఈ, ఆస్పరి మండలం

ధైర్యంగా సేవలందించారు

ఈ ఫొటోలో కనిపిస్తున్న మహిళ పేరు లక్ష్మి. ఎమ్మిగనూరు పట్టణం 27వ వార్డు పరిధిలోని టీబీపీ కాలనీలో నివాసం ఉంటోంది. కోవిడ్ మహమ్మారి సమయంలో వైరస్ బారిన పడడంతో హోం క్వారంటైన్‌లో ఉంచి భర్త ఈరన్న, ఇద్దరు కుమారులు ఆదోనికి వెళ్లారు. ఇంట్లో ఆమె ఒంటరిగా ఉంది. పక్కింటి వారు, బంధువులు ఎవ్వరూ ఆ ఇంటివైపు వెళ్లలేదు. నిబంధనల ప్రకారం ఆమె కూడా ఇంటి నుంచి బయటికి వచ్చేది కాదు. అలాంటి పరిస్థితిలో వలంటీరే ఆమెకు అండగా నిలిచారు. మందులు, నిత్యావసర సరుకులు అందిస్తూ, జాగ్రత్తలు తెలియజేస్తూ కోవిడ్‌ను జయించేలా సహకారం అందించారు. ఏరియా మొత్తం పారిశుద్ధ్య చర్యలు చేపట్టి బ్లీచింగ్ చల్లి స్థానికులకు ఆరోగ్య జాగ్రత్తలు సూచించేవారు.

– ఎమ్మిగనూరు టౌన్



ఎమ్మిగనూరు టీబీపీ కాలనీలో కోవిడ్ సమయంలో మందులు అందిస్తున్న వలంటీర్ శ్రీకాంత్, సచివాలయ సిబ్బంది

అండగా నిలిచారు



కోవిడ్ బారిన పడిన సమయంలో భయంకర పరిస్థితులు ఉండేవి. మా వార్డు వలంటీర్ శ్రీకాంత్ ఇంటికి వచ్చి మందులు, కిట్లు అందించి భరోసా ఇచ్చారు. భయంకరమైన వైరస్ నుండి బారి నుంచి బయటపడి కుటుంబ సభ్యులను కలుస్తామో లేదో అన్న భయం ఉండేది. వైద్య సిబ్బంది సూచనలతో పాటు, వలంటీర్ తెచ్చి ఇచ్చిన మందులు వాడి కోవిడ్ నుంచి బయటపడ్డా. కుటుంబసభ్యులే నిస్సహాయుగా ఉన్న స్థితిలో వలంటీర్లు ప్రాణాలు ఫణంగా పెట్టి నిస్వార్థంగా సేవలందించారు.

– లక్ష్మి, టీబీపీ కాలనీ, ఎమ్మిగనూరు

ఇబ్బంది తెలుసుకుని సాయం చేస్తున్నారు

ఈ చిత్రంలోని వృద్ధురాలి పేరు సామేలమ్మ. ఆస్పరి మండలం కారుమంచి గ్రామం. మూడు నెలల క్రితం ఈమె అనారోగ్యానికి గురైంది. ఆమె కొడుకు రవి ఎమ్మిగనూరు మండలం వెంకటాపురంలో పెళ్లి చేసుకుని అక్కడే స్థిరపడ్డాడు. సామేలమ్మ అనారోగ్యానికి గురికావడంతో వెంకటాపురంలో ఉంటున్న కొడుకు దగ్గరకు వెళ్లింది. అప్పటి నుంచి వలంటీర్ శ్రీనివాసులు 25 కి.మీ దూరంలో ఉన్న వెంకటాపురానికి వెళ్లి వృద్ధాప్య పింఛన్ అందజేస్తున్నాడు.

– ఆస్పరి



వృద్ధురాలు సామేలమ్మకు పింఛన్ అందిస్తున్న వలంటీర్ శ్రీనివాసులు

నెలనెలా తెచ్చి ఇస్తున్నారు

నేను 3 నెలల క్రితం పక్షవాతం బారిన పడ్డాను. ఆరోగ్యం సహకరించక ఎమ్మిగనూరు మండలం వెంకటాపురంలో ఉన్న కొడుకు దగ్గరకు వెళ్లాను. పింఛన్ కోసం కారుమంచికి రాలేని పరిస్థితి. నా ఇబ్బందులు తెలుసుకున్న వలంటీర్ శ్రీనివాసులు ప్రతి నెలా వెంకటాపురానికి వచ్చి పింఛన్ డబ్బులు అందజేస్తున్నాడు. వైద్యం ఖర్చులకు డబ్బులు ఉపయోగపడుతున్నాయి. కన్నబిడ్డలా వలంటీర్ ఇంత దూరం వచ్చి పింఛన్ అందిస్తున్నాడు.

– సామేలమ్మ, కారుమంచి గ్రామం, ఆస్పరి మండలం

'అమ్మ ఒడి'కి అర్హత

ఈ ఫొటోలో బయోమెట్రిక్ నమోదు చేస్తున్న మహిళ పేరు లక్ష్మి. గ్రామానికి చెందిన లక్ష్మి భర్తతో కలిసి బతుకుదెరువు కోసం హైదరాబాద్‌కు వెళ్లారు. వారి కుమార్తె అక్షర గ్రామంలోని పాఠశాలలో రెండో తరగతి చదువుతోంది. పాపను అవ్వతాతల వద్ద వదిలి వెళ్లారు. ఆ కుటుంబం 'అమ్మ ఒడి' పథకం ద్వారా లబ్ధి పొందేందుకు బయోమెట్రిక్ వేయాల్సి వచ్చింది. వారి ఇబ్బందులు తెలుసుకున్న వలంటీర్ రాము హైదరాబాద్‌కు వెళ్లి లక్ష్మితో పాటు మరో ఐదుగురితో బయోమెట్రిక్ వేయించి అమ్మ ఒడి పథకానికి అర్హత సాధించేలా చేశారు.

– తుగ్గలి



హైదరాబాద్‌లో లక్ష్మితో బయోమెట్రిక్ నమోదు చేయిస్తున్న వలంటీర్ రాము (ఫైల్)

మాలాంటోళ్లకు అండగా నిలుస్తున్నారు


గ్రామంలో మేం అందుబాటులో లేకపోయినా ప్రభుత్వ పథకాలు, రాయితీలకు సంబంధించి వలంటీర్ ఎప్పటికప్పుడు మాకు వివరిస్తూ లబ్ధి చేకూరేలా సహాయపడుతున్నాడు. 'అమ్మ ఒడి' పథకం వర్తింపజేసేందుకు హైదరాబాద్‌కు వచ్చి బయోమెట్రిక్ వేయించుకొని వెళ్లాడు. వలంటీర్ ప్రతి విషయం తెలియజేయడం వల్లనే మాకు సంక్షేమ పథకాలు అందుతున్నాయి.

– లక్ష్మి, తుగ్గలి

పండ్ల తోటల సాగులో రాణించాలి

దేవనకొండ: రైతులు పండ్లతోటల సాగులో రాణించాలని 'సే ట్రీస్' సంస్థ రీజనల్ మేనేజర్ పి.మనోహర్ పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆదివారం కప్పట్రాళ్ల గ్రామంలోని తానా స్త్రీశక్తి భవనంలో హార్టికల్చర్ రైతులతో సమావేశమయ్యారు. సంస్థ రీజినల్ మేనేజర్ పి.మనోహర్ మాట్లాడుతూ.. బహుళ అంతస్తు పండ్లతోటల ప్రాముఖ్యతను రైతులకు వివరించారు. ఒకే రకమైన పండ్ల తోటలు సాగు చేయడం ద్వారా రైతులు లాభాలు ఆర్జించడం లేదన్నారు. ఐదు రకాల పండ్ల మొక్కలతో బహుళ అంతస్తుల విధానంలో పండ్ల తోటలను ప్రోత్సహిస్తున్నామన్నారు. అలాగే రైతులను ప్రకృతి వ్యవసాయం వైపు మళ్లించేందుకు బయోగ్యాస్ యూనిట్స్ ప్రారంభించనున్నట్లు తెలిపారు. వాటి ద్వారా వచ్చే వ్యర్థాలను ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో ఉపయోగించేలా ప్రయత్నాలు చేస్తున్నామన్నారు. ప్రోగ్రాం మేనేజర్ బి.నారాయణ, రిసోర్స్‌పర్సన్ చింతమాను రవికుమార్, కప్పట్రాళ్ల మల్లికార్జున, చాకలి లక్ష్మన్న, ఉరుకుందగౌడ్, వారం రమణయ్య, రైతులు పాల్గొన్నారు.

చురుగ్గా సీసీ రోడ్డు నిర్మాణం



ముక్కెల్లలో చేపట్టిన సీసీ రోడ్డు పనులు

తుగ్గలి: మండల పరిధిలోని ముక్కెల్లలో సీసీ రోడ్డు నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో మంజూరైన రూ.20 లక్షల నిధులతో గ్రామంలో సీసీ రోడ్డు పనులు చేపట్టారు. పనులను ఆదివారం వైఎస్సార్‌సీపీ నాయకులు గిడ్డయ్య పరిశీలించారు. గత ప్రభుత్వం వివక్ష చూపడంతో గ్రామం సీసీ రోడ్డు నిర్మాణాలకు నోచుకోలేదన్నారు. వైఎస్సార్‌సీపీ పాలనలో ఇప్పటికే ఎంపీ నిధులు రూ.20 లక్షలతో సీసీ రోడ్లు వేసినట్లు తెలిపారు. ప్రస్తుతం సచివాలయ నిధులు రూ.20 లక్షలతో సీసీ రోడ్లు చేపట్టామన్నారు. సీసీ రోడ్ల నిర్మాణాలకు నిధులు మంజూరుచేసేలా కృషి చేసిన ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

వర్షం కోసం విరాటపర్వం పఠనం



శంకరబండ గ్రామంలో లింగమేశ్వర స్వామిని దర్శించుకుంటున్న భక్తులు

ఆస్పరి: మండలంలోని శంకరబండ గ్రామంలో వెలసిన లింగమేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం వర్షం కోసం గ్రామస్తులు గురప్ప, నారాయణరెడ్డి ఆధ్వర్యంలో విరాట పర్వం పఠనం ప్రారంభించారు. ఆలయంలో స్వామి వారికి 108 బిందెల నీటితో అభిషేకం, మంగళ హారతులు తదితర కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు పెద్దెత్తున హాజరై స్వామివారిని దర్శించుకున్నారు. 24 గంటల పాటు విరాట పర్వం పఠిస్తారని గ్రామస్తులు తెలిపారు. ఆలయంలో భజన కార్యక్రమాలు చేపట్టారు.

వజ్రం లభ్యం?

మద్దికెర: మండలంలో తొలకరి చినుకులు పడగానే వజ్రాలు లభ్యం కావడం సహజం. అయితే ఈ మధ్య కాలంలో వజ్రాలు దొరికాయంటూ వార్తలు వస్తుండడంతో ఆయా గ్రామ ప్రజలు ఆందోళన వ్యకం చేస్తున్నారు. ఆదివారం మండల పరిధిలోని మదనంతపురం గ్రామంలో వజ్రం లభ్యమైందని, ఓ వ్యాపారి కొనుగోలు చేసినట్లు సమాచారం. గతంలో కూడా బసినేపల్లి గ్రామంలో రూ.2 కోట్ల విలువైన వజ్రం దొరికిందంటూ సామాజిక మధ్యమాల్లో ప్రచారం కావడం తెలిసిందే. మళ్లీ ఆదివారం వజ్రం లభ్యమైనట్లు జొన్నగిరి వ్యాపారులు కొనుగోలు చేశారంటూ ప్రచారం జరిగింది. దీంతో ఏది నామ్మాలో తెలియక ప్రజలు అయోమయంలో పడ్డారు.